క్లుప్తంగా

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వీడండి



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరూ పని ఒత్తిడి కారణంగా ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది భవిష్యత్‌లో తీవ్ర అనారోగ్యానికి దారితీస్తోందని ఏలూరు సెంట్రల్ లయన్స్‌క్లబ్ ప్రతినిధి తోట ఎడ్వర్డ్ హెచ్చరించారు. బుధవారం స్థానిక కండ్రిక గూడెం సుస్మిత స్లీప్‌వెల్ వద్ద మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు బి.కృష్ణ, కొడాలి రామ్ ప్రసీన్, భాను కిరణ్, నిడదవోలు పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు సుమారు 250 మందిని పరీక్షించి ఉచితంగా రక్త పరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుస్మిత డయోగ్నస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ నవిరామ్, అడపా రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా విజయ్



ఏలూరు (టూటౌన్): బీజేపీ ఏలూరు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కాట్రు విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ నుంచి బుధవారం నియామక పత్రం అందినట్టు విజయ్ పేర్కొన్నారు. విజయ్ గతంలో ఏలూరు జిల్లా ఇంటలెక్చువల్ కన్వీనర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తపన చౌదరి, బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్, బీజేపీ ఓబీసీ మోర్చా జోనల్ కన్వీనర్ లక్కోజు అనిల్ ఆచార్యతో పాటు తన ఎన్నికకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు డయల్ యువర్ డీఎం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు డిపో పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ బి.వాణి ఒక ప్రకటనలో తెలిపారు. సెల్ నెంబర్ 99592 25487కు డయల్ చేసి తమ సమస్యలను తెలపవచ్చని, ఆర్టీసీ అభివృద్ధికి సూచనలు, సలహాలు కూడా ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమౌతుందని తెలిపారు.

వ్యాయామ విద్యకు ప్రాధాన్యత

- జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యం
- అన్ని ప్రభుత్వ పాఠశాలలకూ క్రీడా పరికరాలు
- కళకళలాడనున్న క్రీడా ప్రాంగణాలు





ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేసిన వివిధ క్రీడా పరికరాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు ఎక్కువగా ఆటలపై ఆసక్తి చూపుతుంటారు. చదవుతూనే క్రీడల్లో రాణించాలని కలలు కంటుంటారు. అయితే గతంలో విద్యార్థులకు ప్రభుత్వాల నుంచి తగిన ప్రోత్సాహం అందేదికాదనే చెప్పాలి. దీనికితోడు కార్పొరేట్ విద్యా సంస్థల్లో అసలు క్రీడా ప్రాంగణాలే ఉండవనేది అందరికీ తెలిసిందే. కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఉదయం 8 గంటలకు వెళ్లిన విద్యార్థి రాత్రి 8 గంటల వరకు పుస్తకాలతోనే కుస్తీపడుతూ శారీరక వ్యాయామానికి కూడా తగిన సమయం కేటాయించలేక ఊబకాయులుగా, అనారోగ్యపీడితులుగా బాధపడుతున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తగినంతగా వ్యాయామం లభించేలా సౌకర్యాలు కలుగజేస్తున్నారు. వివిధ క్రీడల్లో ప్రతిభ చూపుతోన్న విద్యార్థులకు మరింత శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా ప్రోత్సహిస్తున్నారు.

రూ.5 వేల విలువైన క్రీడా పరికరాలు

ఏలూరు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకూ ప్రభుత్వం క్రీడా పరికరాలు సరఫరా చేసింది. గత ప్రభుత్వం కేవలం రూ.500 నుంచి రూ.1000లోపు విలువగల క్రీడా పరికరాలు సరఫరా చేయగా నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుమారు రూ.5 వేల విలువైన క్రీడా పరికరాలను సరఫరా చేసింది. ఇవి నాణ్యమైన మంచి సంస్థలు ఉత్పత్తి చేసిన క్రీడా పరికరాలు సరఫరా చేయడంతో వాటి మన్నిక కూడా ఎక్కువ కాలం ఉండడంతో పాటు విద్యార్థులకు ఆటల సమయంలో మంచి అనుభూతిని పంచుతున్నాయి. దీంతో విద్యార్థులు క్రమశిక్షణతో క్రీడల్లో సత్తా చాటుతూ అత్యుత్తమ ప్రతిభ చూపడానికి మార్గం సుగమమౌతోంది.

అన్ని క్రీడల పరికరాలు

గత ప్రభుత్వం కొన్ని క్రీడా పరికరాలు మాత్రమే సరఫరా చేయగా విద్యార్థులకు అవసరమైన క్రీడా పరికరాల కోసం పీఈటీలు తమ ప్రాంతాల్లోని క్రీడా ప్రోత్సాహకుల నుంచి విరాళాలు సేకరించి అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాల్సి వచ్చేది. నేడు అన్ని రకాల క్రీడలనూ ప్రోత్సహించే విధంగా ఆయా క్రీడలకు సంబంధించిన పరికరాలను ప్రభుత్వం సరఫరా చేసింది. ప్రాథమిక పాఠశాలలకు వాలీబాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, టెన్నిస్ బాల్స్, మల్టీ కలర్ హూలా హూప్స్, స్పెట్ హార్డిల్స్, స్కిప్పింగ్ రోప్‌లు, నెట్‌లు సరఫరా చేసింది. ప్రాథమికోన్నత పాఠశాలలకు బాస్కెట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్ రింగ్, టెన్నికాయిట్ నెట్, స్కిప్పింగ్ రోప్, చెస్ సెట్, వేయింగ్ మిషన్, షాట్‌పుట్, డిస్కస్ రబ్బర్, స్టెప్ హార్డిల్స్ తదితర పరికరాలు సరఫరా చేసింది. ఉన్నత పాఠశాలలకు హ్యాండ్‌బాల్, వాలీబాల్, వాలీబాల్ నెట్, త్రోబాల్, త్రోబాల్ నెట్, టెన్నికాయిట్ నెట్, టెన్నికాయిట్ రింగ్, స్కిప్పింగ్ రోప్స్, యోగా మ్యాట్లు, చెస్ సెట్, ఫుట్ ఎయిర్ పంప్, ఫుట్‌బాల్, వేయింగ్ మిషన్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, మెజరింగ్ టేప్ తదితర క్రీడా పరికరాలు సరఫరా చేసింది.

పీడీ, పీఈటీలకు కాంప్లెక్స్‌లు

విద్యా వ్యవస్థలో తొలిసారి పీడీ, పీఈటీలకు స్కూల్ కాంప్లెక్సులు ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ఏర్పడక ముందు సబ్జెక్టు టీచర్లకు మాత్రమే కాంప్లెక్సులు ఉండేవి. నియోజకవర్గం కేంద్రంగా ఒక కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం ద్వారా వ్యాయామ విద్యకు తగిన ప్రాధాన్యత లభించడంతో పాటు, క్రీడా శిక్షణకు పూర్తి స్థాయిలో అవకాశం కలుగుతోందని పీటీలు, పీఈటీల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి.

దేశం గర్వించే క్రీడాకారులు తయారవుతారు



ప్రభుత్వం క్రీడా రంగంపై కూడా దృష్టి కేంద్రీకరించడం శుభపరిణామం. గతంలో క్రీడా పరికరాలు లేక ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించే అవకాశం లేకపోయేది. ప్రస్తుతం అన్ని రకాల క్రీడా పరికరాలనూ సరఫరా చేయడంతో విద్యార్థి ఏ క్రీడపై ఆసక్తి కనబరిచినా, ఏ క్రీడలో ప్రతిభ చూపినా ఆ క్రీడలో విద్యార్థిని ప్రోత్సహించడానికి మార్గం సుగమమైంది. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో ప్రోత్సాహం లభిస్తుండడంతో దేశం గర్వించే క్రీడాకారులను తయారు చేయడానికి అవకాశం కలుగుతోంది.

– సాంబశివరావు, ఏలూరు అర్బన్ డీఐ

బాలల హక్కుల వారోత్సవాల కరపత్రం విడుదల



బాలల హక్కుల వారోత్సవాల కరపత్రం విడుదల చేసిన రాజేంద్ర ప్రసాద్

ఏలూరు (టూటౌన్) : ఈ నెల 8 నుంచి 14 వరకు జరిగే బాలల హక్కుల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జంగం రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక నరసింహారావుపేటలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో ఆయన బాలల హక్కుల వారోత్సవాల కరపత్రం బుధవారం విడుదల చేశారు. ఈ వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలు, అవుట్ డోర్ లెర్నింగ్ సెంటర్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు డీబీఆర్‌సీ టీమ్ సభ్యులు బలే సురేష్, గోశాల ఝాన్సీరాణి, సింగవరపు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉప ప్రణాళిక ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): వృత్తుల రక్షణ, సంక్షేమం, సామాజిక భద్రత కోసం చేతి వృత్తిదారులకు ఉప ప్రణాళిక ఏర్పాటు చేయాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, క్షౌ ర వృత్తిదారుల సంఘం నాయకులు వి.కిషోర్ కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వాన ఏలూరు విచ్చేసిన బస్సుయాత్ర సందర్భంగా ఆయనకు చేతి వృత్తిదారుల నాయకులు వినతి పత్రం అందజేశారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి చేతి వృత్తిదారుని కుటుంబానికి రూ.3 వేలు పింఛన్ ఇవ్వాలని, నగదు బదిలీ పథకం ద్వారా రూ.25 వేలు అందించాలని, చేతి వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని పేర్కొన్నారు.

టిడ్కో ఇళ్లను అందజేయాలి

ఏలూరు (టూటౌన్): టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని, లబ్ధిదారుల పేరుతో తీసుకున్న బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. సీపీఎం ప్రజా రక్షణ భేరి రాష్ట్ర బస్సు యాత్రలో భాగంగా ఏలూరులో రెండో రోజు ఏలూరు సమీపంలోని పోణంగిలో నిర్మించిన టిడ్కో ఇళ్లను రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్ ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు బుధవారం పరిశీలించారు. అనంతరం శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడారు. 2018లో టీడీపీ ప్రభుత్వం అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లను నిర్మిస్తామని ప్రజల వద్ద నుంచి డిపాజిట్ల రూపంలో డబ్బులు వసూలు చేసి, కొంత బ్యాంకు రుణాల ద్వారా తీసుకుని టిడ్కో ఇళ్లు నిర్మించారని గుర్తుచేశారు. ఏలూరులో 18,646 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. నాటి టీడీపీ హయాంలో ఒక్కో లబ్ధిదారు వద్దా రూ.500 నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారని తెలిపారు. ఏలూరులో పోణంగి, కొత్తూరు ప్రాంతాల్లో దాదాపు ఆరు వేల ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయని వీటిని లబ్ధిదారులకు అందించాలని శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, కిళ్లో సురేంద్ర, సూర్యనారాయణ, బి.సోమయ్య, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో లక్ష్యం వైపు సాగాలి



దిశ చట్టంపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి తమ లక్ష్యాలవైపు సాగాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా దిశ పోలీస్ స్టేషన్ల డీఎస్పీ నున్నా మురళీకృష్ణ సూచించారు. స్థానిక అమీనాపేటలోని సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థినులకు దిశ చట్టంపై అవగాహన కార్యక్రమం బుధవారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ కష్టపడి చదివితే జీవిత కాలం అంతా సంతోషంగా, ఆనందంగా ఉండొచ్చన్నారు. టీనేజ్ (13 నుంచి 19 సంవత్సరాలు) ఉన్న విద్యార్థినులు కష్టపడి చదివితే తమ ఆశయాలు నెరవేర్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వివరించారు. సెల్‌ఫోన్ ఉపయోగించడం వల్ల ఎన్ని లాభాలు ఉన్నాయో, అదే విధంగా జీవితాన్ని నాశనం చేసే నష్టాలు కూడా ఉన్నాయని అన్నారు. ప్రతి ఒక్కరి మొబైల్లో దిశ యాప్ కలిగి ఉండాలని, ఆపద సమయంలో ఎస్‌బీఎస్ బటన్ నొక్కితే 10 నిముషాల్లో పోలీసులు వచ్చి సహకరిస్తారని చేరుకుంటారన్నారు. వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. కళాశాల, పాఠశాల నుంచి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు అపరిచితులతో మాట్లాడకూడదని తమ కుటుంబ వివరాలు తమ వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పొద్దని అన్నారు. సమావేశంలో డీసీపీఓ సూర్యచక్రవేణి, దిశ సీఐ విశ్వం, ఎస్సై కాంతిప్రియ, బాలల హక్కుల రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేంద్ర ప్రసాద్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి



కస్తూరిబా పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విశాఖ ఉక్కు పరిశ్రమని ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఏలూరులోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలను విద్యార్థి సంఘాల నాయకులు మూయించి అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఫైర్ స్టేషన్ సెంటర్లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ ప్రైవేట్ వ్యక్తులైన అంబానీ, ఆదానీలకు అతిచౌకగా కట్టబెడుతోందని విమర్శించారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని నాడు జరిగిన కాల్పుల్లో 32 మంది విద్యార్థులు చనిపోయారని, విద్యార్థుల బలిదానాల సాక్షిగా ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నేడు కేంద్ర ప్రభుత్వం అమ్మేస్తానని బాహాటంగా ప్రకటించడం దారుణమని అన్నారు. ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ విభజన హామీల్లో భాగంగా కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పారని, ఇప్పటికీ రెండు సార్లు శంకుస్థాపన చేసినప్పటికీ పనులు మొదలు పెట్టకపోవడం వల్ల రాయలసీమలో ఉన్నట విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రమైన ఆందోళనకు గురౌతున్నారని, దాని ఫలితంగా ఇతర రాష్ట్రాలకి విద్యార్థులు, నిరుద్యోగులు వలస వెళ్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి, కె.సునీల్, యు.తేజ, పి.యశ్వంత్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్య, విజ్ఞానంతో భవిత బంగారం

ఏలూరు (టూటౌన్): డబ్బు కన్నా విద్య, విజ్ఞానం నేర్పించడం ద్వారా భావితరం ఉత్తమ పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని కపర్ధి భవనంలో ఇస్కాప్ ఆధ్వర్యంలో ప్రముఖ శాంతి స్నేహ సంఘం నాయకులు శాంతినగర్ రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు దాట్ల పద్మనాభరాజు 25వ వర్ధంతి, రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు కేవీ రాఘవరావు, శాంతి స్నేహ సంఘ నాయకులు గొరిపర్తి వెంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇస్కాప్ నాయకులు కడుపు కన్నయ్య అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఏలూరు నగరంలో రేట్ పేయర్స్ అసోసియేషన్‌ని పునర్నిర్మించి వినియోగదారుల సమస్యలపై పనిచేయాలని కోరారు. పద్మనాభరాజు, రాఘవరావు, వెంకటేశ్వరరావుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వాకాడ రాజారావు, ప్రజా నాట్యమండలి గాయకులు పాటూరి నాగేశ్వరరావు, వీరవల్లి వెంకటేశ్వరరావు, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు రెడ్డి శ్రీనివాస డాంగే, చిక్కాల భీమేశ్వరరావు, బీవీఎస్ రావు, బంకా రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి గుంటూరులో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

దెందులూరు: ఈ నెల 26, 27, 28 తేదీల్లో గుంటూరు జిల్లా నరసరావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి 33వ సబ్‌జూనియర్స్ ఖోఖో పోటీల్లో పాల్గొని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి ఉండ్రాజవరం నుంచి వేలివెన్ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈ.సాంబశివరావు, ఎస్‌వీ రంగారావు అన్నారు. బుధవారం గంగన్నగూడెంలో వారు మాట్లాడుతూ 1.01.2010 తరువాత పుట్టినవారై ఉండాలి, ఎత్తు సెంటిమీటర్లలోపు, బరువు కేజీల్లో మొత్తం 215 పాయింట్లు దాటకూడదన్నారు.

పెట్రోలు బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

దెందులూరు: పోతునూరులో పెట్రోలు బంకు నిర్మాణానికి దరఖాస్తు చేసిన స్థలాన్ని బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ బీ.లావణ్యవేణి పరిశీలించారు. స్థలం నాలుగు వైపులా సరిహద్దులు, దారిని చూశారు. రికార్డుల వివరాలు మ్యాప్‌లో చూపించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, వీఆర్వో కిషోర్ ఉన్నారు.


రూ.3.50 కోట్లతో రోడ్డు నిర్మాణం



నిర్మాణం పూర్తయిన పోతునూరు- కేదవరం రోడ్డు

దెందులూరు: పోతునూరు నుంచి కేదవరం వెళ్లాలన్నా, కేదవరం నుంచి పోతునూరు రావాలన్నా దశాబ్దాలుగా రెండు గ్రామాల ప్రజలు చూస్తున్న నరకానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మోక్షం కల్పించారు. ఆయా గ్రామాల ప్రజలు అన్ని అవసరాలు చూసి రూ.3.50 కోట్లతో మంజూరు చేయించి పోతునూరు నుంచి కేదవరం వరకు మూడు కిలోమీటర్ల రోడ్డును వేయించారు. ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు గూడపాటి పవన్‌కుమార్ సొసైటీ చైర్మన్ రమాదేవి డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జి), ఎంపీటీసీ సున్నా నరేష్, డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తలారి రామకృష్ణ, బుద్దా అర్జున, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ రమేష్, కేదవరం, పోతునూరు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ నిర్మల డాక్టరేట్‌కు ఎంపిక



దెందులూరు: మండలంలోని కొవ్వలి గ్రామానికి చెందిన కొరుకోల నిర్మల డాక్టరేట్‌కు ఎంపికయ్యారని ఆంధ్ర విశ్వవిద్యాలయం బుధవారం ప్రకటించింది. నిర్మల భీమవరం కేజీఆర్‌ఎల్ కాలేజీ ఆఫ్ ఫార్మశీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె శేషాచలం అడవుల్లోని మొక్కలపై పరిశోధన చేసి వాటి నుంచి టీబీ, డయాబెటిక్, క్యాన్సర్ వ్యాధుల నివారణకు సంబంధించి ఔషధ గుణాలు, వాటితో మందుల తయారీపై పరిశోధించారు. త్వరలో విశాఖపట్టణంలో నిర్వహించనున్న స్నాతకోత్సవంలో నిర్మలకు డాక్టరేట్ ప్రదానం చేస్తారని వివరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
డీ.తిరుమల ఏలురు బీహెచ్‌ఈఎల్	22.15	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	23

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	34	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	7-10
బెండకాయలు	20	కంద	40
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	40
కాకర కాయలు	20	కీరా దోస	40
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	74
క్యాబేజీ	20	అల్లం	130
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	16	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	60	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	06
దోసకాయలు	18	పుదీనా	05
ఆనబకాయ (1)	15- 20	క్యాప్సికమ్	--
పొట్లకాయ(1)	15- 20	చిలకడదుంప	30
		నిమ్మకాయలు (డజను)	--

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలన



జోగన్నపాలెంలో ఎమ్మెల్యే అబ్బాయి చౌదరికి, ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు ఘన స్వాగతం పలుకుతున్న గ్రామ ప్రజలు

దెందులూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదర్శవంతమైన పాలన అందించిందని ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. జోగన్నపాలెం బుధవారం దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిట్టా గాంధీ, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి పోస్టర్లను ఎమ్మెల్యే, ఎంపీ ఆవిష్కరించి మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.2,800 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. జోగన్నపాలెంలో రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. మంచినీటి సదుపాయం కోసం నూతన పైపులైన్లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన సీఎం జగన్

ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని అన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు నిత్యం అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వివిధ కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధిని, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి జగన్ చేసి చూపించారన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి నిత్యం ప్రజల్లో ఉంటూ నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ప్రజలందరూ కూడా వచ్చే ఎన్నికల్లో అబ్బయ్య చౌదరిని అధిక మెజారిటీతో గెలిపించి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురువేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, వైస్ చైర్మన్ పీ.విజయ్‌బాబు, ఎంపీపీలు పెన్మెత్స శ్రీనివాసరాజు, తాతా రమ్యశ్రీ, బత్తుల రత్నకుమారి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, వైస్ చైర్మన్ కాటి సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు పాల్గొన్నారు.